# మంజువాణి

**ఆ** పర్వత ప్రాంతమంతా ఎత్తైన పచ్చని చెట్లతో పందిరి వేసినట్లే కనిపిస్తోంది. మణిమందిరంలో స్నేహితురాళ్ళ మధ్యన కూచుని చంద్రశిలాతలంపైన వున్న వీణవంక చూస్తోంది గిరిక.

"అమ్మా, ఇది అందుకోండి" వీణ తెచ్చి గిరిక ఒడిలో పెట్టింది ఆమె ఇష్టసఖి మంజువాణి.

"మీ వీణావాదనకి ఈ పర్వత ప్రాంతమంతా మారుమ్రోగాలి.... చెట్లన్నీ చిగుర్చాలి...ఆ మామిడి చెట్టుపై వున్న కోయిల ఊరికే కుహూ, కుహూ, మంటోంది...అది మన వీణముందు ఓడిపోయి పారిపోవాలి... అమ్మా" మంజువాణి ఆగకుండా మాట్లాడుతుంటే గిరిక వీణావాదన మొదలుపెట్టింది.

అదే సమయంలో ఆ ప్రాంతంలో విహారానికొచ్చిన వసురాజు అతని స్నేహితుడు ఆ వీణాధ్వని విని, వెతుక్కుంటూ ఆ ప్రాంతం చేరారు.

అక్కడ మణిమందిరం, అక్కడో ఉద్యానవనం వుండటం గమనించి వసురాజు స్నేహితుడి వంక సార్థకంగా చూసాడు.

యతీశ్వర వేషధారియైన స్నేహితుడు క్షణాలలో మణిమందిరం చేరాడు. "మన గిరిక వీణావాదన విని యతీశ్వరులు మనతో స్నేహం చేయటానికి వచ్చారే" అంది మంజువాణి. స్నేహితురాళ్లంతా తత్తరపాటుతో లేచారు.

సరస సంభాషణ చతురురాలు మంజువాణి యతికి నమస్కరిస్తూ.

"స్వామీ, తమ సార్థక నామధేయం చెప్పి మమ్మల్ని ధన్యుల్ని చేయండి" అంది మంజువాణి యతీశ్వరుని చూస్తూ.

"నా పేరు గౌతముడు. నేను వసురాజుని సేవిస్తూ వుంటాను- ఇంక మా ప్రభువుతో కలసి నేను కైలాసపర్వతం, మానస సరోవరం...."

"మానస సరోవరమా...." మంజువాణి ఆశ్చర్యపోయింది. యతి ఒక నవ్వు నవ్వి,

"ఆ....స్వర్గంలో రంభాదుల నృత్యాలు చూసాను..ఈరోజు మీ చెలిని చూస్తూంటే –" యతి గిరిక వంకే చూస్తూ అన్నాడు.

"ధన్యులం మేము–మీవంటివారు మా మణిమందిరానికి రావటం ఎంత మహాభాగ్యమో...స్వామీ, నా పేరు మంజువాణి" అంది ఎంతో విలాసంగా.

"అది సరే – మీ చెలి ఎవరో, ఏమిటో మాకు తెలియజెప్తే"–

"ఓ-అదా, మీకు తెలియనివి ఏమున్నాయి...అయినా" మంజువాణి యతీంద్రుని పాదాల చెంత కూచుంది.

వీణవంక చూస్తూ, మంజువాణి ఏమి అధిక ప్రసంగం చేస్తుందోనని బెదురు బెదురుగా దిక్కులు చూస్తోంది గిరిక.

"శుక్తిమతీ కోలాహలుల కుమార్తె మా గిరిక. ఆ నాడు కోలాహల పర్వతం శుక్తిమతీ నదికి అవరోధం కల్గిస్తుంటే కాలిగోటితో మీటాడు ఆ పర్వతాన్ని ఆ మహానుభావుడు" - మంజువాణ నమస్కారం చేస్తూ అంది.

"ఏ మహానుభావుడూ...."

"వసురాజేంద్రుడు"-

"అ...చెప్పు మంజువాణీ, నీ చెలి నీకు ఇష్టసఖి మాత్రమే కాదు - నాకూ - ఆ, చెప్పు త్వరగా" - తొందర చేశాడు యతి.

గిరిక జన్మవృత్తాంతమంతా చెప్పేని, "ఆ వసురాజు చేసిన మహోపకారానికి మెచ్చి ఇంద్రుడు పుష్పక విమానం బహుమతిగా ఇచ్చాడట- ఆ మహారాజు ఆ విమానం ఎక్కి పర్వత ప్రాంతాలు, నదీనదాలు, సైకతాలు, ఉద్యానవనాలు, - ఒకటేమిటి, అన్ని ప్రాంతాలలో విహరిస్తుంటాడట"-

"అవును-నాతో కలసి" యతి వినిపించీ వినిపించనట్టుగా అన్నాడు.

"ఆ కోలాహలుని కుమార్తె మా స్నేహితురాలు ఈ గిరిక. ఆమె సౌందర్యం వర్ణించాలంటే మాటలుచాలవు." తన సౌందర్యాన్ని వర్ణించనున్న మంజువాణిని కనుసన్నలతో మందలించింది గిరిక.

"మంజువాణీ"- యతీశ్వరుడు గొంతు సవరించాడు. "ఈమె గొప్ప జాతకురాలు.... ఈమెను వివాహమాడే వ్యక్తి..."

"ఎవరు - చెప్పండి" - మంజువాణి తొందర చేస్తుంటే, యతి కళ్లుమూసుకున్నాడు.

"ఆ -వసురాజేంద్రుడు, అతడు వసురాజేంద్రుడు"-

మంజువాణి ఆనందానికి, ఆశ్చర్యానికి హద్దులేదు. ఆ శుభసమయమెపుడు వస్తుందో అనుకుంటూ, మంజువాణి యతివంక చూస్తూ.

"అయ్యా, ఈ పర్వత ప్రాంతానికి ఆ వసురాజు ఎప్పుడు వస్తాడు?

"వచ్చి, ఈ మణిమందిరంలో ఎప్పుడు ప్రవేశిస్తాడు, ప్రవేశించి మా గిరికను..."మంజువాణి నెమ్మదిగా గొంతు తగ్గించి, యతికి వినబడేలా ఏదో చెప్పబోయింది.

"మీ గిరికను ఎప్పుడు వివాహమాడుతాడు, అదేనా" - యతి చిరునవ్వు నవ్వాడు.

మంజువాణి ఒక్క నిముషం భయపడింది. గిరికను చూడటానికి వచ్చే వసురాజుపై తను ఎక్కువ శ్రద్ధ కనబరుస్తోందని యతి మనసులో ఏమనుకుంటాడో లేకపోతే గిరిక అతి చనువు తీసుకొంటున్నదనుకుంటుదేమో!

వెంటనే మంజువాణి యతికి సవినయంగా నమస్కరించి "స్వామీ, నా తొందరపాటు క్షమించాలి. వసురాజును చూడాలని, మా గిరిక అదృష్టం చూడాలని..."

"మంజువాణీ - నీకోర్కె ఇప్పడే తీరుస్తా....ఆ వసురాజును ఇక్కడికే పిలిపిస్తా"

మంజువాణి ఆనందం పట్టరానిదైంది.

యతి మంత్రం వేయటం, చూస్తుండగానే వసురాజు ప్రత్యక్షమవటం, అంతలోనే యతీంద్రులు అంతర్ధానమవటం అంతా క్షణాలలో జరిగిపోగా విస్తుపోయింది మంజువాణి.

గిరిక వసురాజులొకర్కొకరు చూసుకుంటుంటే ముసిముసిగా నవ్వుతూ పక్కకు చూస్తున్న మంజువాణి కళ్ళను నమ్మలేకపోయింది.

స్నేహితుణ్ణి వెతుక్కుంటూ వచ్చిన యువకుడే గౌతముడు, గౌతముడే యతీశ్వరుడు!!

వసురాజు స్నేహితుడు మంజువాణి వాక్చమత్కారాన్ని తల్చుకుంటూ,

"అమ్మా, మీ స్నేహితురాలు గిరికాదేవికి యతీంద్రులు చెప్పినట్టుగా వసురాజేంద్రునితో..." స్నేహితుడు మంజువాణివంక ఓరగా చూస్తుంటే, "ఆ, ఆ...యతీంద్రులెవరో, గౌతములెవరో ఎవరూ చెప్పక్కర్లేదు స్వామీ...తమరు.." మంజువాణి మాటలకు వసురాజు, అతని స్నేహితుడు పకపకా నవ్వారు.

గిరికా వసురాజుల ప్రణయం మణిమందిరంలో మొదలై, విరహం ఉద్యానవనందాకా వచ్చింది.

మంజువాణి విరహతప్తయైన గిరికహారాన్నితెచ్చి వసురాజుకి, వసురాజు ఇచ్చిన ఉంగరాన్ని గిరికకి అందించి గిరికా వసురాజుల విరహానికి ఉపశమనం కల్గించింది.

ఆఖరికి గిరికా వసురాజుల వివాహంలో ముఖ్యపాత్ర వహించి సరస సంభాషణతో అందరినీ నవ్వించింది మంజువాణి.

- కావ్యతారలు - వనిత డిశంబరు 1989